క్లుప్తంగా

వరద బాధితులకు విరాళం అందజేత



లక్ష్మీపురం: విజయవాడ వరద బాధితులకు సహాయార్థం గుంటూరు జిల్లాలో సేకరించిన ఒక లక్ష రూపాయల విరాళాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ ఆదివారం విజయవాడ రాష్ట్ర పార్టీ కార్యాలయం దాసరి భవన్‌లో అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, కేవీవీ ప్రసాద్, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్ని తిరుపతయ్య, పుప్పాల సత్యనారాయణ, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి వై.చెంచయ్య పాల్గొన్నారు.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని చెప్పారు.

భావి తరాలకు కర్ణాటక సంగీతం అందించడం లక్ష్యం

నగరంపాలెం: భావి తరాలకు సంప్రదాయ కర్ణాటక సంగీతాన్ని అందించడమే లక్ష్యమని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ మందిరంలో ఆదివారం కర్ణాటక గాత్ర సంగీత పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ హాజరై, తమ ప్రతిభను చాటారు. వచ్చే నెలలో రెండో విడత పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.3 వేలు, రెండో బహుమతి రూ.2 వేలు, మూడో బహుమతి వెయ్యి రూపాయలు అని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు వాగ్గేయకార ఉత్సవాల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా సాయిశృతి మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ ప్రేమకుమార్, శ్రీభారతి సంగీత నిలయం అధ్యక్షురాలు భారతీదేవి, సంగీత కళాశాల ఉపాధ్యాయులు బి.సురేష్‌బాబు వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గిరిజా శంకర్, కార్యవర్గ సభ్యులు సరయు, రాజ్యలక్ష్మి, ఫణితేజ పాల్గొన్నారు.



గాత్ర సంగీత పోటీల్లో ఓ విద్యార్థినీ..

చిన్నారుల పెద్ద మనస్సు



గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని అయ్యప్ప రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో చిన్నారులు దాతృత్వం చాటారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం తల్లిదండ్రుల నుంచి సేకరించిన రూ.21,534లను తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్‌కు ఆదివారం ఆయన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో చలమయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, అయ్యప్ప రెసిడెన్సీ వాసులు నాగధర్, సుహాస్, శ్రీనిధి, పావని, రితిక, దాశరథి విఘ్నేశ్వర్, నిత్య, దినేష్, ఆర్యవైశ్య నాయకులు కొనకళ్ల సత్యం, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఉత్సవ కమిటీ కన్వీనర్ కోటా శేషగిరి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో స్వచ్ఛత హి సేవ



గుంటూరు: జీజీహెచ్ నుంచి రోగి ఆరోగ్యంగా ఇంటికి వెళ్లాలంటే వైద్యంతో పాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జీజీహెచ్‌లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి గోడలకు రంగులు వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని కోరారు. పరిశుభ్రం చేసేందుకు వలంటీర్లు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకట కిరణ్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం

అపూర్వ సమ్మేళనం
- మధుర స్మృతులను నెమరువేసుకున్న సహచరులు
- విశ్రాంత గురువులకు ఘనంగా సన్మానం
- బాపూజీ హైస్కూల్లో 1986–87 టెన్త్ బ్యాచ్ కలయిక



సమ్మేళానికి హాజరైన 1986- 87 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఒక్కొక్కరుగా ఆ ప్రాంగణంలోకి అడుగుపెడుతుంటే.. ఏళ్ల నాటి తలపులు తుమ్మెద నాదమై గుండెల్లో సవ్వడి చేశాయి. మిత్రులను చూసిన ఆనందంలో కళ్లు కాంతి రేఖలై ఆ ప్రాంగణాన్ని ఇంద్రధనస్సులా మార్చాయి. బాగున్నావా అంటూ కలిసిన బాల్య స్నేహితుల కరాలు.. ఎన్నాళ్లకు ఈ భాగ్యమంటూ మరింతగా బిగుసుకున్నాయి. చదువులమ్మ ఒడిలో అలనాటి అల్లరి చేష్టలు మరుపురాని గురుతులై మదిని తడుతుంటే పెదవులపై చిక్కని చిరునవ్వుల మందారాలు విరబూశాయి. బాల్యంలో ఒడిలోకి లాలనగా తీసుకుని అదిగో బంగారు జీవితమంటూ జ్ఞానాన్ని గోరుముద్దలు చేసి అందించిన గురువుల పాదాలకు విద్యా కుసుమాలు కృతజ్ఞతాభిషేకం చేశాయి. చివరకు ఆనందంతో నిండిన గుండెలు.. ఆప్యాయతల దారానికి కట్టిన అనుబంధాల మల్లెల సుమ గంధాలను దాచుకుని మళ్లీ కలుద్దాం మిత్రమా అంటూ కదిలి వెళ్లాయి.

సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య జూనియర్ కళాశాలలో ఆదివారం బాపూజీ హైస్కూల్ 1986–87 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 160 మంది విద్యార్థులకు గాను 130 మంది హాజరయ్యారు. నాడు విద్యాబుద్ధులు నేర్పి, భావి జీవితానికి బాటలు వేసిన గురువులను తలచుకున్న పూర్వ విద్యార్థులు విశ్రాంత గురువులు విజయలక్ష్మి, హైమావతి, సుబ్బారావును సమావేశానికి తీసుకొచ్చి, వారిని ఘనంగా సన్మాంచుకుని పాదాభివందనం చేశారు. పూర్వ విద్యార్థులందరినీ ఒకచోటకు చేర్చి వారిని ఆత్మీయ కలయిక నిర్వహించడంలో పూర్వ విద్యార్థులు అచ్యుత సునీల్, శ్రీరాం సురేష్, బైసాని రమేష్, చీతిరాల ఇందిర, పోలిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు, అప్పల రాము కృషి చేశారు.

విద్యార్థి పోరాటాల గొంతుక సీతారాం ఏచూరి



ఏచూరి చిత్రపటానికి పూల మాల వేసినివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

లక్ష్మీపురం: విద్యార్థి పోరాటాల గొంతుక సీతారాం ఏచూరి అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. తొలుత మాజీ ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కిరణ్ మాట్లాడుతూ విద్యార్థి దశలో యూనివర్సిటీ సమస్యల మీద మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఇంటి వద్ద ధర్నా చేసినట్లు గుర్తు చేశారు. ఎస్ఎఫ్ఐ నినాదం చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు అనే నినాదంతో ఎమర్జెన్సీని ఎదిరించి పోరాడిన సైనికుడు అని అన్నారు. విద్యార్థి నాయకత్వం నుంచి సి.పి.ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు ఎదగడంలో ఎస్ఎఫ్ఐలో చేసిన ఎన్నో పోరాటాలు మనకు ఆదర్శం అని చెప్పారు. విద్యార్థి దశ నుంచే కాక ఎంపీగా ఉన్న సమయంలో విద్యార్థి సమస్యలను పార్లమెంట్లో ప్రస్తావిస్తూ నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ అనేక ప్రసంగాలు చేశారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 20–20ని ప్రవేశ పెడుతూ విద్యని ప్రైవేటీకరణ, కాషాయీకరణ, కేంద్రీకరణ చేయాలని చూస్తుందని పార్లమెంట్లో ఆయన తన గొంతుకను వినిపించారని చెప్పారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించటమే సీతారాం ఏచూరికి నిజమైన నివాళి అని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్కే సమీర్, ఉపాధ్యక్షురాలు సుచరిత, సహాయ కార్యదర్శులు పవన్, యశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు అభి, షరీఫ్, జగదీష్, ఆరిఫా, ప్రతాప్, అజయ్ పాల్గొన్నారు.

అల్జీమర్స్ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే సమస్యలు

డాక్టర్ కె.సురేష్‌కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ కె.సురేష్‌కుమార్

లక్ష్మీపురం: అల్జీమర్స్ వ్యాధిని గుర్తించి ప్రారంభ దశలోనే చికిత్స చేయించుకుంటే మంచిదని, నిర్లక్ష్యం చేస్తే రోగికి, కుటుంబ సభ్యులకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయని ప్రముఖ మానసిక వైద్యులు కోట సురేష్‌కుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు పై బడిన వారిలో ఎక్కువగా మతిమరపు వస్తుందని, ఈ వ్యాధిని రాకుండా నిరోధించలేమని, అయితే అది రావడానికి తోడ్పడే కారణాలను త్వరగా గుర్తిస్తే ఎక్కువగా పెరగకుండా చూడవచ్చన్నారు. వయస్సు పెరిగే కొద్ది మెదడులో వచ్చే మార్పులు, కొన్ని చెడు ప్రోటీన్లు మెదడులో చేరడంతో నరాలు క్రమంగా క్షీణించి పోవడంతో ఈ అల్జీమర్స్ సమస్య ఎదురవుతుందని వివరించారు. అనంతరం డాక్టర్ సురేష్‌కుమార్‌ను సంస్థ కార్యదర్శి శివరామిరెడ్డి, సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ విశ్లేషకులు వి.వి.రావ్, డాక్టర్ రవీంద్రకుమార్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జాషువా పద్యాల్లో నవరసాలు



డాక్టర్ గరికపాటి గురజాడను సన్మానిస్తున్న దృశ్యం

నగరంపాలెం: సామాజిక అధికార కవి జాషువా అని కేంద్రీయ విశ్వ విద్యాలయం(అనంతపురం జిల్లా) తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ జి.గురజాడ అన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతి ఉత్సవాల్లో భాగంగా మహాకవి జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జాషువా పద్యానికి పట్టాభిషేకం అంశంపై సభ నిర్వహించారు. సభకు మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అధ్యక్షత వహించారు. సభను ఉద్దేశించి డాక్టర్ గరికపాటి గురజాడ మాట్లాడుతూ జాషువా పద్యాల్లో నవరసాలు ఉంటాయని ప్రశంసించారు. మహాకవి గుర్రం జాషువా సున్నితమైన మనస్కుడని, అదే ఆయన గొప్ప లక్షణమని అన్నారు. గుర్రం జాషువా ప్రపంచంలోని ప్రతి వస్తువులో భగవంతుడ్ని చూశారని తెలిపారు. కన్నతల్లిని ప్రేమించిన వాడే సమాజాన్ని ప్రేమిస్తారని వివరించారు. అధ్యక్షత వహించిన మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ గుర్రం జాషువా సమాజ కవి అని అన్నారు. పద్యసాహిత్యాలతోపాటు అనేక రంగాల్లో దిట్ట అని పేర్కొన్నారు. ఆయన చేసిన సాహితీసేవ చిరస్మరణీయమని, ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ఒక గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.గురజాడను సన్మానించారు. సభలో ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, ఎంజేఎస్ఎస్ అధ్యక్షుడు పినపాటి మోహనరావు, ప్రముఖ న్యాయవాది గద్దం ఎలీషా, కవి నాటక ప్రయోక్త డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, సాహితీ పరిశోధకులు పారా అశోక్, అత్తోట జోసెఫ్, జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఆలయ కమిటీ కార్యదర్శి బి.ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, మోసాలపై అప్రమత్తత అవసరం



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

తెనాలి రూరల్: సైబర్ నేరాలు, మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ బి.జనార్ధనరావు ఆధ్వర్యంలో వారధి కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి స్థానిక ఫుడ్ గ్రెయిన్స్ అండ్ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాలులో పోలీసులు నిర్వహించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ఓటీపీ, ఈకేవైసీ మోసాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి వాటిపై వీడియో రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు, టూ టౌన్ సీఐ నిస్సార్ బాషా, రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు, పలువురు వ్యాపారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజ్ఞాచారికి జాతీయ సాహితీ సేవా పురస్కారం



తెనాలి రూరల్: మండలంలోని కొలకలూరుకు చెందిన సాహితీరత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి జాతీయ సాహితీ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. షిరిడి సాయినాథుని 189వ జయంతిని పురస్కరించుకుని చిలకలూరిపేటకు చెందిన జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయి మహానుభావా సాహితీ సేవ జాతీయ పురస్కారాన్ని అందించనున్నారు. దశాబ్దాల నుంచి సాహితీ సేవ చేస్తున్న పూర్ణ ప్రజ్ఞాచారిని జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్టు ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ తెలిపారు. చిలకలూరిపేట శ్రీ సాయి టెక్నో స్కూల్ ఆవరణలో ఈ నెల 28న పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు చెప్పారు.

తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని పరీక్షించి నిజాలు తేల్చాలి

గుంటూరు మెడికల్: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదం విషయంలో ప్రభుత్వం వెంటనే గతంలో తయారు చేసిన, ప్రస్తుతం తయారు చేస్తున్న లడ్డూలను పరీక్షల నిమిత్తం పంపించి పరీక్షలు చేయించాలని ఆల్ ఇండియా బ్రహ్మణ ఫెడరేషన్ ఈసీ మెంబర్ వెలవర్తిపాటి పాండురంగ విఠల్ డిమాండ్ చేశారు. పరీక్షలు చేయించి నిజాన్ని నిగ్గ తేల్చి ప్రజలకు నిజంగా లడ్డు తయారీలో కల్తీ జరిగిందా లేదా అనే విషయాన్ని తెలియజెప్పాల్సిన అవసరం ప్రస్తుత అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ కళావేదికపై ఆదివారం సాయంత్రం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నమతీర్థల సిస్టర్స్ యుగళ శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. త్యాగరాజ కీర్తనలతో పాటు పలు వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. కచేరి సంగీతాభిమానులను అలరించింది. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై బీరక సురేష్‌బాబు వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్, ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్ పాల్గొనగా, కళాకారులను సత్కరించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



కొల్లిపర: ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం రాత్రి సిబ్బందితో కలసి మండలంలోని వల్లభాపురం, అత్తలూరిపాలెం గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తలూరి గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించారు. డ్రైవర్‌వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి, ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మధ్యాహ్నం కొల్లిపరలోని హోలీక్రాస్ పాఠశాల సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం రెండు మోటార్ సైకిళ్లు పాఠశాల సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మండలంలోని పిడపర్తిపాలేనికి చెందిన కంచర్ల ఏసోబుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. ప్రమాదంలో మరొక వ్యక్తి కొల్లిపర గ్రామానికి చెందిన యువకుడు. అతడికి స్వల్పంగా గాయాలయ్యాయి.

ప్రగతి పథంలో కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ

సర్వసభ్య సమావేశంలో చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు

తెనాలి: కాకతీయ మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, తెనాలి 23వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని ఎన్జీవో కల్యాణ మండపంలో ఏర్పాటైన సమావేశానికి సొసైటీ చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు అధ్యక్షత వహించారు. సొసైటీ సీఈఓ కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి వార్షిక నివేదికను సమర్పించారు. సభ్యులు, ప్రజల సహకారం, ఆదరణతో సొసైటీ పురోగమిస్తోందని లక్ష్మీకాంతారావు వెల్లడించారు. సొసైటీ తరఫున సిక్త్ సిగ్మా చెస్ అకాడమీ చాంపియన్‌షిప్‌లో విజేతలైన చిన్నారులకు నగదు బహుమతులు, పేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్లు, సభ్యులు చైర్మన్ లక్ష్మీకాంతారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, షేక్ ఖలీల్, దావులూరి చక్రధర చౌదరి పాల్గొన్నారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాల్ని ప్రదర్శించారు.

అబాకస్ సాధనతో విద్యార్థుల మేధకు పదును



కలరింగ్ పోటీకి హాజరైన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: అబాకస్ సాధనతో విద్యార్థుల మేధకు పదును పెట్టవచ్చునని సిప్ అబాకస్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. అశోక్ నగర్‌లో సిప్ అబాకస్ ఇంటర్నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శాఖను ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా నగరంలోని వివిధ ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు కలరింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత నైపుణ్యాలు వెలికితీసి, వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ధారణశక్తిని పెంపొందించడంలో అబాకస్ దోహదపడుతుందని అన్నారు. గణితంలో మంచి ప్రావీణ్యత సాధించేందుకు సులువైన పద్ధతుల్లో అబాకస్ అందిస్తున్నట్లు తెలిపారు. సిప్ అబాకస్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం ప్రపంచవ్యాప్తంగా 12 దేశాలతో పాటు భారతదేశంలోని 23 రాష్ట్రాల్లో 950 శాఖలతో ఐదువేల మంది ఉపాధ్యాయులతో అబాకస్ శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈసందర్భంగా కలరింగ్ పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు హెడ్ మిల్కీ, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సారూ! ఇది డ్రెయిన్ ఆక్రమణ కాదంటారా!

- పూర్తిగా డ్రెయిన్‌ను ఆధారం చేసుకుని నిర్మించిన షాపు
- నేడు ప్రారంభానికి సిద్ధం



పొత్తూరి వారితోట మెయిన్‌రోడ్డులో డ్రెయిన్‌పై నిర్మాణం చేపట్టిన దృశ్యం

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యాపారులు అడుగడుగునా అవమానాలు ఎదుర్కొంటున్నారు. నిన్న.. మొన్నటి వరకు ప్రశాంతంగా ఉన్న పట్నంబజారులో డ్రెయిన్ మీద షాపులు నిర్మించిన వారిని స్వయంగా దగ్గరుండి పొక్లెయిన్‌లతో పగలగొట్టించిన తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్... అదే నియోజకవర్గంలో డ్రెయిన్‌ను ఆధారం చేసుకుని వ్యాపార సముదాయం నిర్మిస్తే.. దానిని తొలగించలేదు. పొత్తూరి వారితోట(పాత బస్టాండ్ సెంటర్ నుంచి స్టేడియానికి వెళ్లే ప్రధాన రహదారి)లో డ్రెయిన్ మీద పూర్తి నిర్మాణం చేపట్టారు ఓ వ్యాపారుడు. దీన్ని స్థానిక ఎమ్మెల్యే నసీర్ సోమవారం ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ రోడ్డులో అన్ని కూడా డ్రెయిన్లపై నిర్మాణాలు చేపట్టినవే... మరి వీటిపై ఏ నగరపాలక సంస్థ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో... ఎమ్మెల్యే ఏ విధంగా చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

స్కాలర్‌షిప్పులు, కుట్టుమిషన్లు పంపిణీ



స్కాలర్‌షిప్పులు, కుట్టు మిషన్లు అందజేస్తున్న జల్లెడ శ్రీనివాస్‌గౌడ్, నాగవెంటక శివప్రసాద్

గుంటూరు మెడికల్: పట్నంబజారులోని సుష్మగౌడ్ ఫౌండేషన్ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు జల్లెడ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఇద్దరు మహిళలకు కుట్టు మిషన్లు, ప్రతిభా కనపరిచిన 11 మంది విద్యార్థులకు రూ.1,10,000 స్కాలర్‌షిప్పులు పంపిణీ చేశారు. సుష్మ గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జల్లెడ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పేదలకు, విద్యార్థులకు సహకారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు నాగ వెంకట శివప్రసాద్ గౌడ్, ప్రధాన కోశాధికారి జల్లెడ జయసుస్మితారావు గౌడ్ , కార్యదర్శి జల్లెడ సుష్మా రావు గౌడ్ , సహా కార్యదర్శి హరిత గౌడ్ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు వాకా రాంగోపాల్ గౌడ్, గుంటూరు జిల్లా గౌడ్ సంఘ అధ్యక్షుడు తుళ్ళూరు శ్రీనివాసరావు, గీతా బంధు సేవా ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ వీరంకి రంగారావు, రాష్ట్ర గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి వేముల వెంకటాచలం, కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్టు ఫౌండర్ సెక్రటరీ బోళ్ళ వెంకటేశ్వరరావు, చైర్మన్ పామర్తి సాంబశివరావు, గౌడ సేవా ట్రస్టు అధ్యక్షుడు దాసరి వెంకట్రావు. గౌడ సేవా ట్రస్టు ఉపాధ్యక్షుడు చెన్ను శ్రీనివాసా కుమార్. గుంటూరు అర్బన్ గౌడ సంఘం అధ్యక్షుడు రావుల మణి గౌడ్, డాక్టరు శాంతి కిషోర్, తాతా కోటయ్య, వాకా మాధవ్, వాకా సాంబశివరావు పాల్గొన్నారు.

రేపు కొత్త సచ్చిదానందమూర్తి శతజయంతి



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న వీరనారాయణ, రామరాజు

తెనాలి: భారతీయ తత్వశాస్త్రంలో విశేష కృషి చేసిన తెనాలికి చెందిన సుప్రసిద్ధ తత్వశాస్త్రవేత్త పద్మ విభూషణ్ కొత్త సచ్చిదానందమూర్తి శతజయంతిని ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నారు. పట్టణానికి చెందిన వివేక ఎడ్యుకేషనల్ సొసైటీ, తెనాలి ఇంప్రెషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వేడుక ఆహ్వాన పత్రికను ఆదివారం వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు ఆవిష్కరించారు. అనంతరం వివరాలను తెలియజేశారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలోని థియేటరులో జరిగే శతజయంతి సభకు డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. తెనాలి ఇంప్రెషన్స్ రూపొందించిన 'పద్మవిభూషణ్ కొత్త సచ్చిదానందమూర్తి' పుస్తకాన్ని కవి, రచయిత, సమగ్ర శిక్ష విశ్రాంత సంచాలకుడు వాడ్రేవు చినవీరభద్రుడు ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, ప్రజాసాహితీ మాసపత్రిక ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు హాజరవుతారని తెలిపారు. తత్వశాస్త్రాన్ని సామాన్యులకు అర్థమయేలా కృషిచేసిన సచ్చిదానందమూర్తి, భారత నాగరికత, చరిత్ర, సాంఘిక అంశాలతో పాటు హిందూ ధర్మ శాస్త్రాలు, మెటాఫిజిక్స్, ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీలపై ఇంగ్లిష్‌లో 30పైగా, తెలుగులో 12కు పైగా అత్యంత ప్రాముఖ్యత కలిగిన గ్రంథాలను రచించినట్టు వీరనారాయణరావు తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించినట్లు వివరించారు. కార్యక్రమంలో మురళి, కె.రిషిత, పి.మోనాలి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్ భాస్కరరావు

తెనాలి రూరల్: పట్టణ మారీసుపేటలోని రాక్ గాస్పెల్ చర్చిలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. సంఘ కాపరి బిషప్ పినపాటి జాన్‌పాల్ సహకారంతో గంగానమ్మపేటకు చెందిన శ్రీలక్ష్మి విజన్‌కేర్ సెంటర్ వైద్యులు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 150 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 50 మందికి కళ్లజోళ్లు, 100 మందికి మందులను ఉచితంగా అందజేశారు. త్వరలో 10 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్సలను ఉచితంగా చేయనున్నట్టు విజన్ కేర్ సెంటర్ నిర్వాహకుడు డాక్టర్ భాస్కరరావు తెలిపారు. తమ వైద్యశాల ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా రాక్ గాస్పెల్ చర్చిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమాన్ని చర్చి సంఘ పెద్దలు పినపాటి డేవిడ్ రాజు, ఈవూరి శ్రీనివాసరావు, కసుకుర్తి భాస్కరరావు, జైరాజు, ఈవూరి ఏసురత్నం, పినపాటి ఫ్రాన్సిస్, కొతెవరపు ఏసుదాస్ పర్యవేక్షించారు.